చౌదరిగూడలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చౌదరిగూడలో సీసీ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్: చౌదరిగూడ సాయిరాం నగర్ కాలనీలో రూ. 5 లక్షల జెడ్పీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చౌదరిగూడ గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్, వార్డు సభ్యుడు భోజిరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు నర్సింగ్‌ముదిరాజ్, నరసింహా, సందీప్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, దావిద్‌రెడ్డి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సీ సర్టిఫికెట్ పరీక్షలు



ఘట్‌కేసర్: అనురాగ్ విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎన్‌సీసీ క్యాడెట్లు ''సీ'' సర్టిఫికెట్ పరీక్షలకు శుక్రవారం హాజరయ్యారు. సికింద్రాబాద్‌లోని బైసన్ గ్రౌండ్‌లో ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ ప్రాక్టికల్ ఎగ్జామ్‌ను ఈసీఓ గ్రూపు కెప్టెన్ వర్ష గోఖలే, వింగ్ కమాండర్ డీఎస్‌ఎన్ మూర్తి, కో కాకినాడ ఎయిర్ ఎన్‌సీసీ యూనిట్‌తో కలిసి పరీక్ష నిర్వహించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు



ఘట్‌కేసర్: చౌదరిగూడకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ధరావత్ వెంకటేశ్ నాయక్, ధరావత్ రవినాయక్, ప్రశాంత్‌నాయక్ తదితరులు ఆ గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్, వార్డు సభ్యుడు భోజిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నర్సింగ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ప్రతాపసింగారంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

కుంటలు, చెరువులు కబ్జా చేస్తే చర్యలు



చాకలి లక్ష్మయ్యకుంట స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కీసర: కుంటలు, చెరువు స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని కీసర మండల ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ అన్నారు. శుక్రవారం కీసర దాయర రెవెన్యూ పరిధిలోని చాకలి లక్ష్మయ్య కుంటను కొందరు కబ్జాకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదు మేరకు కుంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పనులు చేపట్టినా, కుంట ఎఫ్‌టిఎల్‌స్థలాన్ని పూడ్చే యత్నంచేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

ఫొటోగ్రఫీలో కానిస్టేబుల్‌కు జాతీయ స్థాయి అవార్డు



మేడ్చల్: ఫొటోగ్రఫీలో మేడ్చల్ కుచెందిన కానిస్టేబుల్ కు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌కు చెందిన దేవేందర్‌ప్రసాద్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నాడు. లక్నోలో ఈనెల 12 నుండి 16వ తేదీ వరకు 67వ ఆల్‌ఇండియా పోలీస్‌డ్యూట్ మీట్ నిర్వహించగా అందులో పాల్గొన్న దేవేందర్‌ప్రసాద్ పోలీస్ విభాగంలో పరిశోధనకు సహకరించే ఫోటోలు తీయడంతో ఆయనకు రాష్ట్రం నుండి అవార్డు లభించింది.

న్యాక్ గుర్తింపు వేడుకలు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ విజ్ఞాన్ మహిళా ఇంజనీరిగ్ కళాశాలలో నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడియేషన్ (న్యాక్) గుర్తింపు వేడుకలు నిర్వహించారు. సీఈఓ బోయపాటి శ్రావణ్, పిన్సిపల్ డాక్టర్ అప్పారావు నాయుడు వేడుకల్లో పాల్గొన్నారు.

పనుల్లో అలసత్వం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పనులకై అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు పనుల్లో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ఎంతవరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు ఫీల్డ్‌లో ఉండాలన్నారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజనీరింగ్, శానిటరీ అధికారులు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎదురు చూపులు..!

- మహిళా సంఘాలకు వడ్డీ రాక పోవటంతో తీరని ఆర్థికభారం
- ఐదేళ్లుగా ఇబ్బందుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యుల
- కొత్త సర్కారుపై ఆశలు



రుణం ఉపాధికి వినియోగం..

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఏటా బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందిస్తోంది. రుణాలకు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయాలి సుమారు రూ.7 లక్షల లోపు రుణం పొందితే 7 శాతం వడ్డీ చెల్లించాలి. అందులో 3 శాతం వడ్డీ జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ క్రమం తప్పకుండా సంఘాల ఖాతాల్లో జమ చేస్తోంది. మిగిలిన వడ్డీ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా... గడిచిన అయిదేళ్లుగా వడ్డీ జమ చేయడం లేదు. వీటి కోసం వేలాది మంది మహిళా సంఘాల సభ్యులు ఎదురుచూస్తున్నారు. దీంతో సంఘాల సభ్యులపై ఆర్థికభారం పడుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తామని పలు మార్లు ప్రకటించినా... కార్యరూపం దాల్చ లేదు. దీంతో మహిళా సంఘాల సభ్యులకు ఎదురు చూపులే మిగిలాయి. ఈ చెల్లింపులపై కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంపైన మహిళా సంఘాలు కోటి ఆశలు పెట్టుకున్నారు.

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాలలో మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలకు స్వయం ఉపాధికి ఉపయోగించుకుంటారు. అనంతరం నెలవారీగా వడ్డీతో కలిసి చెల్లిస్తారు. నాలుగైదు నెలలకోసారి ప్రభుత్వం వడ్డీ డబ్బులు విడుదల చేస్తోంది. ఇలా వచ్చిన దబ్బులను బ్యాంకు మొత్తం రుణంలో తగ్గిస్తారు. దీంతో వడ్డీ భారం మహిళా సంఘాలపై పడదు. కానీ అయిదేళ్ల నుంచి వడ్డీ డబ్బులు జమ కావడం లేదు. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అందించినా... క్రమంగా కొన్ని పథకాలు తొలగించారు. ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి నిమిత్తం బ్యాంకు రుణాలు మాత్రమే అందిస్తున్నారు.

కొత్త సర్కారు చెల్లిస్తే ....

బ్యాంకులలో తీసుకున్న రుణాన్ని ఎంత కష్టమైనా వడ్డీతో సహా మహిళా సంఘాల సభ్యులు చెల్లిస్తున్నారు. కొన్నేళ్లుగా వడ్డీ డబ్బులు రాకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. వడ్డీ డబ్బులను చెల్లిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండగలదని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ బకాయిలను విడుదల చేయటం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మేలు జరగగలదంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

2.43 లక్షల మంది మహిళలు

- నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాల పరిధిలో 906 గ్రామ సంఘాలు ఉండగా, ఇందులో 22,580 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 2,43,244 మంది మహిళా సభ్యులు ఉన్నారు.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 118 గ్రామ సంఘాలు ఉండగా, ఇందులో 3,383 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 36,553 మంది మహిళా సభ్యులు కొనసాగుతున్నారు.
- రంగారెడ్డి జిల్లాలో 788 గ్రామ సంఘాలు ఉండగా, ఇందులో 19,192 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 2,06,691 మంది మహిళా సభ్యులు ఉన్నారు.

కారు దిగనున్న మేయర్ కావ్య..?

19న అవిశ్వాస పరీక్ష



మేయర్ మేకల కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య కారు దిగి చెయ్యి అందుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు శుక్రవారం ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తుండటంతో ఒక్కసారిగా జవహర్‌నగర్ అవిశ్వాస క్యాంపు రాజకీయంలో అలజడి మొదలైంది. 19 మంది కార్పొరేటర్లతో డిప్యూటీ మేయర్ వర్గం ఇప్పటికీ క్యాంపులోనే కొనసాగుతున్నారు.

మేయర్ కాంగ్రెస్‌లో చేరితే అవిశ్వాసం ఆగేనా..

ప్రస్తుతం మేయర్ వెంట ఏడుగురు కార్పొరేటర్లు ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ నిహారికగౌడ్ మాత్రమే ఇక్కడ ఉన్నారు. మిగిలిన 19 మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు అసమ్మతి క్యాంపు రాజకీయం చేస్తున్నారు. ఈ నెల 19వ తేదీన మేయర్‌పై అవిశ్వాసం పెట్టగా మేయర్ కావ్య కాంగ్రెస్‌లో చేరితే పరిస్థితి ఏంటని పెద్ద ఎత్తున రాజకీయ అలజడి మొదలైంది.

ఈ నెల 19న బలనిరూపణ

మేయర్ మేకల కావ్యపై పెట్టిన అవిశ్వాస పరీక్షకు ఈ నెల 19న బలనిరూపణ చేయనున్నారు. మేయర్ కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని వార్త రావడం, మరోవైపు డిప్యూటీ మేయర్ వర్గం 19 మంది కార్పొరేటర్ల బలంతో అవిశ్వాసం నెగ్గుతామని ధీమాతో ఉన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: పట్టణంలోని బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం పట్టణంలో పలు కాలనీలలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శిఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉమానగర్, బాలాజీనగర్, చంద్రనగర్, ఎంఆర్‌ఆర్ కాలనీ, వెంకట్రామయ్య కాలనీ, కృపా కాంప్లెక్స్, స్ఫూర్తి కాలేజ్ తదితర కాలనీలలో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

మేడ్చల్ సీఐ బదిలీ

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డి శుక్రవారం బదిలీ అయ్యారు. శుక్రవారం సాయంత్రం సైబరాబాద్ కమీషనర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేయగా మేడ్చల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న నర్సింహారెడ్డిని దుండిగల్, సూరారం డీఐగా బదిలీ చేశారు. కమీషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ మేడ్చల్ నూతన సీఐగా బదిలీపై రానున్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శేఖర్, ప్రిన్సిపల్ మాధవిలత

మేడ్చల్ రూరల్: విద్యార్థినులు టెక్నాలజీతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని హెక్సాగాన్ క్యాపబిలిటీ సెంటర్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ కొణిడెన అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నికల్ సింపోజియం కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు చదువుతో పాటు టెక్నికల్ స్కిల్ ఎంతో అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో తరచూ పాల్గొని టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ స్కిల్ పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్‌కు సన్మానం



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి నూతన తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి ని శుక్రవారం లక్ష్మాపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు కటికెల వైద్యనాథ్ సన్మానించారు. శుక్రవారం తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించడంతో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ నాగజ్యోతి, ఆర్‌ఐ నరేశ్, రాఘవ,నాయకులు పాల్గొన్నారు.

రైతు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జవహర్‌నగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

జవహర్‌నగర్: దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌కు ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీకెఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు గడుస్తున్నా రైతాంగ, కార్మిక వర్గ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, కార్మికులకు కనీస వేతనం లేక కుటుంబ భారం ఎదుర్కొంటున్నారన్నారు. నిత్యావసర ధరలు పెరిగిపోయాయని, కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శివ బాబు, కాప్రా మండల సీపీ కార్యదర్శి యాదగిరి, శివనారాయణ, రాజేశ్వరి, స్వరూప, రవినాయక్, ఎల్లయ్య, లక్ష్మణ్, తిరుపతి, ఆంజనేయులు, వెంకటమ్మ, తిరుపతి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో..

గ్రామీణ బంద్‌లో భాగంగా జవహర్‌నగర్ ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ రషీద్ మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ, కార్పొరేట్ రాజకీయాలను ఖండించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు ఎండి.పాషామియా, కార్యదర్శి టి.కాలేషా, ఐపీవోడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత, ఇప్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి, టీఎస్‌ఎస్‌ఎస్ అధ్యక్షులు జావేద్, వెంకటేష్, ఆంజనేయులు, సయ్యద్, వహీద్, అబ్దుల్లా, బాషా, రహమత్, సాదుల్‌పాషా, అజీమ్, షావలి, వలీ, మైనుద్దీన్, మస్తాన్, అబ్బు, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణనతో సమన్యాయం

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్రంలోని అన్నివర్గాలకు సమ న్యాయం జరిగేలా బీసీ కుల గణన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోవటం సముచితంగా ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ శాసన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ లను ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పుష్ప గుచ్ఛాలు అందజేశారు.

మితిమీతున్న యాజమాన్యం ఆగడాలు

మేడిపల్లి: మేడిపల్లిలోని లాంగ్ డ్రైవ్ కార్ల కంపెనీ ఉద్యోగులపై యాజమాన్యం ఆగడాలు మితి మీరుతున్నాయి.తమ సంస్థలో పనిచేసేవారిపై దాడులకు తెగబడుతున్నట్లు తెలిసింది. తమ మాట వినని ఉద్యోగులను చిత్రహింసలకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఉపాధి కోసం సంస్థను ఆశ్రయించిన చిరుద్యోగుల అవసరాలను, బలహీనతలను గుర్తించి వారి జీవితాలతో యాజమాన్యం ఆటలాడుకుంటోందని తెలిసింది. ఈ విషయాలపై సోషల్ మీడియాలో నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు. పోలీసులు కూడా దాడికి పాల్పడ్డ వారికోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్‌లో చేరిన కో-ఆప్షన్ సభ్యురాలు



కాంగ్రెస్‌లో చేరుతున్న కో-ఆప్షన్ సభ్యురాలు శ్వేతాముఖేష్

జవహర్‌నగర్: తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జవహర్‌నగర్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యురాలు శ్వేతాముఖేష్ అన్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో శ్వేతాముఖేష్ దంపతులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. జవహర్‌నగర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బొల్లిగూడెం మహాలక్ష్మినగర్‌కు చెందిన ఎం. వాణి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ రూ 2.50లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు రాసాల వెంకటేశ్ యాదవ్, తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

పరిశోధనలతో సమస్యలకు పరిష్కారం

సెయింట్ పీటర్స్ లో అంతర్జాతీయ సదస్సు



సదస్సు సావినార్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మేడ్చల్ రూరల్: పరిశోధనల ద్వారానే మనకున్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఐఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, సెయింట్ పీటర్స్ కళాశాల కార్యదర్శి టివి రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాలలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నాలెడ్జ్ ఇంజనీరింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు ను శుక్రవారం ప్రారంభించి సావనీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఒక టూల్ అని దాన్ని మనం మనకు కావల్సిన పద్ధతిలో ఉపయోగించుకోవచ్చని సూచించారు. ప్రపంచం మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో నడుస్తుందని, మనకు వస్తున్న సమస్యలను వివిధ రకాల మాధ్యమాల ద్వారా పరిష్కరించుకోగలుగుతున్నామన్నారు.ఏఐ లో చాలా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. చాలా వరకు పీహెచ్‌డీ తర్వాత పరిశోధనలు ఆపేస్తున్నారని పీహెచ్‌డీ తర్వాత కూడా రీసెర్చ్‌లను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో కుమార్ ఫణి, సచిన్‌నందన్, కళాశాల డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, డీన్ లక్ష్మిదేవి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ ఇందిరా లక్ష్మీ నారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్

కీసర: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం చీర్యాల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం అధికారుల పాలన ఉన్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు వివిధ వార్డుల్లో పర్యటించి ప్రజలసమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇదిలా వుండగా చీర్యాల గ్రామానికి జవహర్‌నగర్ చెత్తడంపింగ్‌యార్డు వల్ల కలుగుతున్న ఇబ్బందులను గ్రామస్తులు గ్రామ సభ దృష్టికితీసుకువచ్చారు. జెడ్పీ వైస్ చైర్మెన్ బెస్తవెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లల చదువును గమనించాలి



సమావేశంలో పాల్గొన్న తల్లిండ్రదులు

మేడ్చల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులపై ఉపాధ్యాయులతో పాటు తల్లిందండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని యునైటెడ్ వే ఆఫ్ హైద్రాబాద్ సంస్థ మేనేజర్ అమర్ అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన మండల ప్రభుత్వ పాఠశాలల పేరెంట్స్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లితండ్రులు శ్రమించాలని అన్నారు. ఇంటి వద్ద పిల్లలు ఫోన్లకు, టీవీలకు అతుక్కుపోకుండా చదువుపై ధ్యాస ఉంచేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో రైల్వే స్టేషన్ ప్రేమరీ స్కూల్ కు ఆకృతిఫౌండేషన్ లైబ్రరీ కిట్ అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులు సమావేశానికి ఎందుకు రాలేదు?

కమిషనర్లను ప్రశ్నించిన ఛైర్మన్ వెంకటేశన్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశుద్ధ్య కార్మికులు సమావేశానికి ఎందుకు రాలేదని, వారికి సమాచార లోపం ఏమైనా ఉందా అని పురపాలక సంఘాల కమిషనర్లను సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్ ప్రశ్నించారు.శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో పారిశుద్ధ్య కార్మికుల స్థితిగతులను చర్చించేందుకు సఫాయి కర్మచారి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ,ఎస్సీ,ఎస్టీ అభివృద్ధి శాఖల జిల్లా అధికారి వినోద్‌కుమార్, పురపాలక సంఘాల కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు,పోలీసు అధికారులు హాజరయ్యారు. సమావేశానికి పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులు తక్కువ సంఖ్యలో రావటంపై జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామీణ సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొన లేకపోయినట్లు చైర్మన్‌తో పలువురు అధికారులు పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న ఏఐటిసియూ రాష్ట్ర కార్యదర్శి యేసు రత్నం మాత్రం మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు అశోక్, కిషన్‌రావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కార్మికుల సమ్మె



శామీర్‌పేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శామీర్‌పేట్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక,రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన కార్మికుల సమ్మె కార్యక్రమంలో శామీర్‌పేట్‌లో ప్రశాంతంగా జరిగింది. సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శామీర్‌పేట్‌లో రాజీవ్ రహదారిపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ధార్నా,నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతీ ఒక్కరూ బీజేపీపై పోరు చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కిష్టప్ప, నాయకులు రవిందర్, సంగప్ప,ముత్యాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో గ్రామీణ భారత్ బంద్ విజయవంతం



మేడ్చల్‌లో కార్మికుల ర్యాలీ

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం కార్మిక సంఘాలు చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ మేడ్చల్ లో విజయవంతమైంది. సీఐటీయు ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు, వివిధ పరిశ్రమల కార్మికులు జాతీయ రహదారిపై ఆర్టీసీ డిపో నుండి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పలు రకాల పరిశ్రమలు, ఆటోలు బంద్ చేశారు. కార్మికులు తమ విధులను బహిష్కరించి బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌లో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, నాయకులు కోమురయ్య, నర్సింగ్‌రావు,నరేష్, శ్రీలత, పద్మ, వసంత ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.